క్లుప్తంగా...

పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో ప్రవేశాలు

గోల్కొండ: పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో 2023–24 సంవత్సరానికి గాను ప్రవేశాలు ప్రారంభమయ్యాయని యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐలోని వివిధ విభాగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, జూన్ 6 వరకు దరఖాస్తు గడు వు ఉందని ఆయన తెలిపారు. http/: iti.telangana.gov.in తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. వివరాలకు 98668 43920లో సంప్రదించాలని ఆయన కోరారు. తమ విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, బోనోఫైడ్‌లను కూడా తమ దరఖాస్తుతో అప్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

నూతన ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు



అఫ్జల్‌గంజ్: అఫ్జల్‌గంజ్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా చిట్టి బుర్రా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఎం. రవీందర్‌రెడ్డిని స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. మహాకాంళి పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చిట్టి బుర్రను అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆదివారం సీపీఎం గోషామహల్ నాయకులు నాగేశ్వర్, జంగయ్య, కుర్మయ్య, బలరామ్, వెంకటేష్ తదితరులు ఆమెకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాజీవ్‌గాంధీ హయాంలోనే దేశాభివృద్ధి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్మల్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హయాంలోనే దేశం అన్నిరంగాల్లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని టీపీసీసీ కార్యదర్శి నిర్మల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్‌యాదవ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవం దేశంలో తెచ్చిన ఘనత రాజీవ్‌గాంధీదే అన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామ్‌సింగ్, కిషన్, రఘునందన్ యాదవ్, కృష్ణకుమార్, మహ్మద్ జమీల్, మనోజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

24న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమి పూజ



చార్మినార్: ఉప్పుగూడ మహంకాళి ఆలయ ప్రాంగణంలో కొత్తగా నిర్మించనున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ (కల్యాణ మండపం)కి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈనెల 24న భూమి పూజ చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్ గౌడ్ తెలిపారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూ.4.96 కోట్ల వ్యయంతో నిర్వహించనున్న ఈ ఫంక్షన్ హాల్ పాత బస్తీ ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండనుందన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు మూడు అంతస్తులు ఈ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరగనుందన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ భూమి పూజా కార్యక్రమానికి చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తో పాటు పలువురు అధికార, అనాధికార ప్రముఖులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

నానల్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి

గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్‌లో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ నానల్‌నగర్ డివిజన్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ నిధులు కేటాయిస్తున్నారన్నారు. వరద ముంపు నివారణకు బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, నిజాం కాలనీ, అల్ హస్నాత్ కాలనీలలో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, దీంతో ఈ రెండు కాలనీలకు వరద ముంపు ప్రమాదం పూర్తిగా తప్పిందన్నారు.

సమాజ సేవతోనే మానసిక తృప్తి



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న పరావస్తు మధుకర్‌స్వామి, విద్యాభూషన్



ఉచిత మెడికల్ క్యాంపులో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాచకొండ డీసీపీ పరావస్తు మధుకర్‌స్వామి

అబిడ్స్: సమాజ సేవ చేయడంలోనే మనిషికి ఎంతో మానసిక తృప్తి ఉంటుందని రాచకొండ డీసీపీ పరావస్తు మధుకర్‌స్వామి పేర్కొన్నారు. సమాజ సేవకు స్వచ్ఛంద సంస్థలతో పాటు పలు వర్గాల వారు కూడా అంకితం కావాలన్నారు. సీతారామ్ బాగ్‌లోని ఈశ్వర్‌చంద్ర హెల్త్ సెంటర్‌లో ఉచితంగా శిక్షణ పొందిన వారికి కుట్టుమిషన్లను ఆదివారం పంపిణీ చేశారు. అదేవిధంగా పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్‌ల్యాండ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మధుకర్ స్వామి మాట్లాడుతూ.. తమ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో తరచూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. గత కొన్ని నెలలుగా ఉచిత టైలరింగ్‌లో శిక్షణను ఇచ్చి పలువురు మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈశ్వర్‌చంద్ర హెల్త్ సెంటర్‌లో నిరంతరం వైద్య శిబిరాలు నిర్వహించి స్థానిక పేద బడుగువర్గాల ప్రజలకు చేయూతనందిస్తున్నట్లు మధుకర్‌స్వామి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిజినల్ సెక్రటరీ, విద్యాభూషణ్, రఘునాథ్‌రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి, ప్రొఫెసర్ రాజ్‌కుమార్, లయన్ కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే 'డబుల్' ఇళ్లు కేటాయిస్తాం: కిషన్‌రెడ్డి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ తదితరులు

గోల్కొండ: బోజగుట్టలో అర్హులైన వారికే డబుల్ బెడ్‌రూంలు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బోజగుట్ట డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి న్యాయపరమైన చిక్కుల విషయంపై గుడిమల్కాపూర్ బీజేపీ నాయకులు ఆదివారం కేంద్రమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు సుమారు 300 మంది లబ్ధిదారుల కోసం న్యాయ స్థానం ఇచ్చిన తీర్పు కాపీలను కేంద్రమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ నిధులను పక్కదారి పట్టించడం, రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా చెప్పుకుంటుందన్నారు. కాగా అర్హులైన వారికి అండగా నిలుస్తానని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన లబ్ధిదారుల న్యాయవాదులతో ఫోన్‌లో మాట్లాడి అర్హులైన వారికి న్యాయం జరిగేంత వరకు న్యాయం పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ తదితరులున్నారు.

రోడ్లపైనే వాహనాలు.. రాకపోకలకు ఇబ్బందులు



పురానాపూల్ ఇక్బాల్‌గంజ్ మద్యం దుకాణాల వద్ద నిలిచిన ద్విచక్ర వాహనాలు

జియాగూడ: పురానాపూల్ నుంచి జియాగూడ రహదారిలో మద్యం దుకాణాలు పుట్టగొడుగులా వెలిశాయి. దీంతో ప్రయాణికులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలకు సైతం బార్‌లు, వైన్స్‌ల కారణంగా నానా ఇబ్బందులు కలుగుతున్నాయి. రహదారి మధ్య వరకు ద్విచక్ర వాహనాలు నిలిపి వేసి మద్యం దుకాణాలకు వెళ్తుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. పురానాపూల్ చౌరస్తాలోనే మద్యం దుకాణాలు విపరీతంగా వెలిశాయి. తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అలాగే జాతీయ రహదారి, మేకలమండి, నవోదయ గంగా నగర్, కమేళా గేటు పక్కన వెలిసిన బార్‌ల కారణంగా కూడా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తలెత్తుతుంది. ఇక్కడి నుంచే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు రాకపోకలు కొనసాగుతుండగా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే మద్యం దుకాణాల ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వృద్ధుల కోసం ప్రత్యేక ఆస్పత్రి



మాట్లాడుతున్న డాక్టర్ మహేష్ మర్దా

గోల్కొండ: సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు ప్రీమియర్ ఆస్పత్రి ముందుకు రావడం అభినందనీయమని పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మెహిదీపట్నం పిల్లర్ నెం. 78 వద్ద కొత్తగా నిర్మించిన ప్రీమియర్ సీనియర్ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన వైద్య సర్వీసులో సీనియర్ సిటిజన్ల కోసం ఇటువంటి ఆస్పత్రి చూడలేదన్నారు. ప్రీమియర్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ మహేష్ మర్దా మాట్లాడుతూ.. 65 ఏళ్లు పైబడ్డ వారికి అన్నిరకాల వైద్య పరీక్షలు, రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రత్యేకంగా ఒకే భవనంలో ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రుల్లో ఎక్కువ శాతం ఆక్యుపెన్సీ సీనియర్ సిటిజన్లదే ఉంటుందని ఆయన అన్నారు. దీనిని తాను గుర్తించి వీరి కోసం ప్రత్యేక ఆస్పత్రిని నిర్మించాలని ఆలోచన వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్ల వైద్య అవసరాలను తీర్చడంలో పూర్తి సమర్థ విధానాన్ని అనుసరించి ప్రీమియర్ సీనియర్‌ను ప్రారంభిస్తున్నామన్నారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి



చినజీయర్ స్వామిజీ ఆశీర్వాదం తీసుకుంటున్న ఉదయలక్ష్మి తదితరులు

గన్‌ఫౌండ్రీ: గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ మేరకు ఆదివారం చిన జీయర్ స్వామీని కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ ఐదు సూత్రాలతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. అందులో ప్రధానంగా గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించడం అనే నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ.శ్రీధర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు ప్రదానం



అవార్డును అందజేస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి చెల్లప్ప తదితరులు

గన్‌ఫౌండ్రీ: దంత వ్యాధుల నివారణతో పాటు పొగాకు రహిత సమాజం కోసం విశిష్ట సేవలు చేస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రావుకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం ఎంతో ప్రశంసనీయమని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎస్.చెల్లప్ప అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ నాగేశ్వర్‌రావుకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి డ్టార్ కె.శివభాగ్యరావు, దళిత సేనా జాతీయ చైర్మన్ డాక్టర్ జెవి.రాజు, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, ప్రజా కవి జయరాజు, సీనియర్ జర్నలిస్ట్ సతీష్ చందర్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా కో ఆర్డినేటర్ బి.నరేందర్ గౌడ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ తెలంగాణ కో ఆర్డినేటర్ ఎం.విజయలక్ష్మీ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమ బోగరాజు పాల్గొన్నారు.

అవతార్ మెహర్ బాబా పుస్తకావిష్కరణ



భక్తి గీతాలను ఆలపిస్తున్న భక్తులు

గన్‌ఫౌండ్రీ: యావత్ మానవాళికి ప్రేమ విలువలను పంచిన మహనీయుడు అవతార్ మెహర బాబా అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో అవతార్ మెహర్ బాబా హైదరాబాద్ కేంద్రం ఆధ్వర్యంలో మెహర్‌బాబా పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ సమాజ స్థాపన కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. సాంస్కృతిక సాహిత్య సమ్మేళనాలతో కూడిన ప్రవచనాలను తెలుగులోకి అనువాదించి పుస్తకరూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం మెహర్ భక్తులతో రవీంద్రభారతి ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణం తలపించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణయ్య, హైదరాబాద్ కేంద్రం కార్యదర్శి రాజేందర్ మెహర్‌లతో పాటు జంట నగరాలకు మెహర్ భక్తులు పాల్గొన్నారు.

అన్ని స్థానాలలో పోటీ చేస్తాం



వివిధ పార్టీ కార్యకర్తలను ఆహ్వానిస్తున్న శ్రీధర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ అన్నారు. ఆదివారం గన్‌ఫౌండ్రీ సూర్యలోగ్ కాంప్లెక్స్‌లోని పార్టీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలకు కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐదు పంచ సూత్రాలతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా కమిటీలను వేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వేమన ఆంధ్ర భాషా నిలయాన్ని పరిరక్షించండి



దీనావస్థలో వేమన ఆంధ్ర భాషా నిలయం

నాంపల్లి: సమాజ శ్రేయస్సుకు దోహదపడిన విజ్ఞాన భాండాగారం వేమన ఆంధ్ర భాషా నిలయం నేడు ఆనవాళ్లు లేకుండా పోయాయి. ప్రస్తుతం ఆ నిలయం దీనావస్థకు చేరుకుంది. అందరికీ చదువు, విజ్ఞానాన్ని అందించాలనే సదుద్దేశంతో 1923లో ఈ సంస్థను నాంపల్లి బజార్‌ఘాట్‌లో నెలకొల్పారు. పదేళ్ల కిందటి వరకు వేమన ఆంధ్ర భాష నిలయం విశాలమైన ప్రాంగణంలో అలరారుతుండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. అందులోని గ్రంథాలు, పుస్తకాలు మాయమయ్యాయి. ఆ ప్రాంగణమంతా పరుల చేతిలోనికి వెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దారిన వెళ్లే వారంతా పాడుబడిన బోర్డును చూసి ఓహో ఇక్కడ గ్రంథాలయం ఉండేదనుకుని ఆశ్చర్యపోతున్నారు. కాబట్టి ఇప్పటికైనా భాషావేత్తలు, సాహితీమూర్తులు, వేమన అభిమానులు, భాషా సాంస్కృతిక శాఖ అధికారులు మరుగునపడిన వేమన ఆంధ్ర భాషా నిలయాన్ని పరిరక్షించుకోవాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: ఉర్సు ఉత్సవాలు ప్రజల భక్తి విశ్వాసాలకు ప్రతీక అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. హకీంపేట్‌లోని హకీమ్షా బాబా దర్గా 385వ ఉర్సు ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన దర్గాను సందర్శించి దర్గాపై పూల చాదర్ వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంతో ప్రాచీనమైన ఈ దర్గాకు ఏటేటా వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తుందని, అంతేకాకుండా పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా ఇక్కడ సౌకర్యాలు కూడా పెరుగుతున్నాయన్నారు. అన్నదాన కార్యక్రమంతో పాటు దర్గా నిర్వాహకులు ఉచిత దర్గా తరఫున పెళ్లిళ్లు చేయిస్తూ ఒక నూతన ఒరవడిని సృష్టించారని ఆయన అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి కార్పొరేటర్ ప్రతినిధి హారూన్ ఫరాన్, గోల్కొండ కార్పొరేటర్ ప్రతినిధి బదర్ ఉద్దీన్, దర్గా ముతవలి, అలీముద్దీన్, సయ్యద్ జబ్బార్ తదితరులున్నారు.

కలుషితనీటి సరఫరాను అరికట్టాలి



సరఫరా అవుతున్న కలుషిత నీరు

అబిడ్స్: కొన్ని రోజులుగా అల్లా బండ సెక్షన్ ప్రాంతంలోని ఇందిరానగర్ బస్తీలో కలుషిత నీటి సరఫరా అవుతున్నా వాటర్‌బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 రోజులుగా ఇందిరానగర్ బస్తీలో కలుషిత నీటి సరఫరా అవుతుండడంతో స్థానికులు అనారోగ్యాలు గురవుతున్నారు. వాటర్‌బోర్డు జీఎం, డీజీఎం, జీఎంల దృష్టికి కలుషిత నీటి సరఫరా నివారించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనం రావడం లేదన్నారు. అల్లాబండ సెక్షన్ మేనేజర్‌కు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేయకగా ఆయన స్పందించకపోవడంతో డీజీఎం, జీఎంలకు కూడా ఫిర్యాదు చేసినా కలుషిత నీటి సరఫరా అలాగే కొనసాగుతుందన్నారు. వెంటనే మరమ్మతులు చేసి కలుషిత నీటి సరఫరాను అరికట్టకుంటే వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇందిరానగర్ ప్రాంతంలో ఇంటి నెంబర్:13–1–1236 పరిసర ప్రాంత ఇళ్లల్లో ప్రతిరోజూ కలుషిత నీటి సరఫరా అవుతుందని వారు వాపోయారు.

పిల్లల కోసం సమ్మర్ క్యాంపులు అభినందనీయం



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆలే భాస్కర్‌రావు, కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గోల్కొండ: జనహిత్ చారిటబుల్ ట్రస్ట్ వారు రెండు దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం గొప్ప విషయమని బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్ అన్నారు. జనహిత్ ట్రస్ట్, ఈఎల్ఎం ఫౌండేషన్ వారు పిల్లల కోసం నిర్వహించిన సమ్మర్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులకు ఆదివారం ఆయన గౌలిగూడ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మితో కలిసి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల కోసం సమ్మర్ క్యాంపుల్లో పిల్లల శారీరక, మానసిక ఉల్లాసం కోసమే కాకుండా వారికి చదువు పట్ల కూడా అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఇటువంటి వేసవి శిబిరాల్లో పాల్గొన్న చిన్నారులు చిన్ననాటి నుంచే తమ భావి లక్ష్యాలను నిర్ణయించుకునే అవకాశం ఉంటుందని, తాము ఇష్టపడే క్రీడను సైతం వారు బాగా నేర్చుకుంటారని ఆయన అన్నారు. అనంతరం ఆయన జనహిత్ ట్రస్ట్‌ను ప్రారంభించిన దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులతో కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి ముచ్చటించి సమ్మర్ క్యాంపులో వారు నేర్చుకున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్, కార్యదర్శి కట్టా నర్సింగరావు, బీజేపి రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ, ముల్లె రాకేష్, దేవర శివకుమార్, ప్రభు పూజారి తదితరులున్నారు.

సన్మానం



అంబటి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ఐకమత్యంగా ఉంటేనే అన్ని రకాలైన హక్కులను సాధించగలుగుతామని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడిగా అంబటి శ్రీనివాస్ నియమితులైన సందర్భంగా ఆయనను ఆదివారం పద్మశాలి సేవా సంఘం భవనంలో గజమాలతో సన్మానించి శివాజీ మహరాజ్ జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పద్మశాలి యువకులు సమాజ సేవలో ముందుకు రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల దేవేందర్, బాలేష్ కుమార్ తదితరులున్నారు.

బ్రాహ్మణ భవన్ ప్రారంభానికి తరలిరావాలి



మాట్లాడుతున్న కాండూరి కృష్ణమాచారి

సుల్తాన్‌బజార్: ఈనెల 31న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించబోయే బ్రాహ్మణ భవన్‌కు అర్చక, ఉద్యోగులు వేలాదిగా తరలిరావాలని తెలంగాణ దేవాదాయ శాఖ జేఏసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి పిలుపునిచ్చారు. ఈ మేరకు బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడుతూ 2017లో 577 జీఓ ప్రకారం.. 5625 మంది ఉద్యోగులను గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ వాఖ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, జేఏసీ కన్వీనర్ పి.రవీంద్రాచార్యులు, అర్చక అధ్యక్షుడు చింతపట్ల బద్రీనాథ్, అర్చక వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్ర చంద్ర శేఖర శర్మ, గ్రేటర్ అధ్యక్షుడు నాగరాజు శర్మ, కృష్ణమాచార్యులు, గంగు సత్యమూర్తి, సంతోష్, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ వాకింగ్ చేయండి



మాట్లాడుతున్న వరకుమార్ గుప్తా, డాక్టర్ రాజేందర్ కుమార్ తదితరులు

అబిడ్స్: ప్రతిఒక్కరూ ఆరోగ్యకరంగా ఉండేందుకు కొంతసేపు అయినా ప్రతిరోజూ వాకింగ్ చేయాలని వాసవిక్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు వరకుమార్‌గుప్తా పేర్కొన్నారు. మనిషి తన ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే వందేళ్ల జీవితం సుఖశాంతులతో ఉంటుందన్నారు. ఆదివారం వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ల ఆధ్వర్యంలో ఉచితంగా న్యూరో, ఆర్థోపెడిక్ సమస్యలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. వరకుమార్‌గుప్తా మాట్లాడుతూ.. తమ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. డాక్టర్ రాజేందర్ ప్రసాద్ మాట్లాడుతూ.. జీవితంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యకర జీవితం పొందేందుకు శారీరక శ్రమ ఎంతో అవసరమన్నారు. వాకింగ్, యోగాసనాలు కొంతసేపు అయినా చేస్తే ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి అంబరిషా, కోశాధికారి వెంకటేష్, పూర్వ అధ్యక్షులు చక్రపాణి, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు రమేష్‌రెడ్డి, నీరంజన్ రెడ్డి, డాక్టర్ సునిల్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.